సాక్షి జనగామ

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



పొదుపు మంత్రం.. భవిత భద్రం

పొదుపు .. మానవ జీవన క్రమంలో అత్యంత కీలకం. భవిష్యత్ అవసరాలు.. ఆపత్కాలంలో.. ఇతర వైపరీత్యాలకు ఎదురొడ్డి నిలబడాలంటే డబ్బు ఒక్కటే మార్గం. - 8లో



దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే.. - 8లో

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41°/26°

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండవేడి అధికంగా ఉంటుంది. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు 6:35	శుక్ర 4:45

న్యూస్‌రీల్

తాగునీటి సరఫరా పర్యవేక్షణకు ఐఏఎస్

ఉమ్మడి వరంగల్‌కు బి.గోపి నియామకం

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. 33 జిల్లాలకు 10 మంది ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపిని నియమించింది. కలెక్టర్లను సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాలో నీటి సమస్య ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జనగామ ఏసీపీగా అంకిత్‌కుమార్



జనగామ: జనగామ ఏసీపీగా 2020 బ్యాచ్‌కు చెందిన అంకిత్‌కుమార్ సంక్వార్ (ఐపీఎస్)ను నియమిస్తూ సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ఏసీపీ దామోదర్‌రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలక్షన్ కమిషన్ డీజీకి అటాచ్ చేస్తూ బదిలీ చేసింది. అయితే ఆయన స్థానంలో తన వద్ద ఉన్న పార్థసారధికి వరంగల్ సీపీ పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న ఐపీఎస్ అధికారి అంకిత్‌కుమార్‌ను వారం రోజుల క్రితం వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అంకిత్‌కుమార్‌కు జనగామ ఏసీపీగా పోస్టింగ్ ఇవ్వడంతో గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

జీడికల్ చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష నగదు సీజ్



లింగాలఘణపురం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన జీడికల్ చెక్‌పోస్టు వద్ద బుధవారం కొండబోయిన సోమరాజుకు చెందిన రూ.లక్ష నగదుకు ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగకు చెందిన సోమరాజు హైదరాబాద్ నుంచి వస్తుండగా ఆయన వాహనం తనిఖీ చేయగా నగదు లభించిందని, భూమి విక్రయించగా వచ్చిన డబ్బులని చెప్పినట్లు తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ కమిటీకి తగిన ఆధారాలు చూపించి తీసుకుపోవాలని సూచించినట్లు ఎస్సై వివరించారు.

కొమురయ్య వీరత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



జనగామ: దొడ్డి కొమురయ్య వీరత్వాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు బాల్దే మల్లేశం అన్నారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో దొడ్డి కొమురయ్య విగ్రహాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు జుకంటి శ్రీశైలం, కేమిడి ఉపేందర్, దయ్యాల శ్రీనివాస్, కర్రె రాములు, జూకంటి మధు, కర్రె సిద్దులు, బాల్దే సోమయ్య, కర్రె కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దే సిద్ధిలింగం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కరువు తీరా నీరు..!

మంగోలు వద్ద పూర్తయిన మొదటి దశ ట్రీట్‌మెంట్ ప్లాంట్





జిల్లాకు సరఫరా చేసే కొమురవెల్లి ఓహెచ్‌బీఆర్

‘భగీరథ’కు కొత్త రూట్

- మల్లన్నసాగర్ నుంచి నూతన పైపులైన్
- 540 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మంగోలు వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్లు
- పూర్తయిన 135 ఎంఎల్‌డీ ప్లాంట్
- జిల్లాకు ప్రారంభమైన నీటి సరఫరా

జనగామ: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు మిషన్ భగీరథకు కొత్త రూట్‌కు శ్రీకారం చుట్టారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని.. పల్లెలు, పట్టణాల్లో తాగునీటి కష్టాలు రాకుండా మల్లన్నసాగర్‌కు అనుసంధానంగా నూతన ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా హైదరాబాద్‌కు సరఫరా చేసే నీటి నుంచి కొండపాక సంప్ హౌస్ మీదుగా జనగామకు మళ్లించారు. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గిన సమయంలో జిల్లాకు వచ్చే ఎంఎల్‌డీ(మిలియన్స్ ఆఫ్ లీటర్ ఫర్ డే)లో కోత విధించే వారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మల్లన్నసాగర్ నీటిని వినియోగించుకునేలా ప్లాన్ చేశారు.

మొదటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ పూర్తి..

గజ్వెల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండలం మంగోలు వద్ద రూ.1,100 కోట్ల వ్యయంతో 540 ఎంఎల్‌డీ(ప్రతి రోజు 5కోట్ల 40 లక్షల లీటర్ల తాగునీరు) తయారీ సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నాలుగు దశలో నిర్మాణం చేపట్టగా.. 135 ఎంఎల్‌డీ మొదటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ పూయింది. దీని ద్వారా జిల్లాకు తాగునీరు పరుగులు పెడుతోంది. ఇక్కడ రోజూ కోటీ 35 లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసి సిద్దిపేట మున్సిపాలిటీతోపాటు సిద్దిపేట, నంగునూరు మండలాలు, జనగామ నియోజకవర్గ పరిధి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధి ధర్మసాగర్ మండలం, మహబూబాబాద్ జిల్లా పెదవంగరను కలుపుకుని సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మున్సిపాలిటీకి శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నారు.

అవసరానికి మించి నీటి సరఫరా..

జిల్లాకు రోజూ 53.77 ఎంఎల్‌డీ(5.30 కోట్ల లీటర్ల తాగునీరు) అవసరం. ప్రస్తుతం మంగోలు ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా 58.09 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా చేస్తున్నారు. మిషన్‌భగీరథ తాగునీటి సరఫరాకు జిల్లాలో 1,710 కిలోమీటర్ల (ఇంట్రా/లోకల్), 1,500 కిలోమీటర్లు (గ్రిడ్/మెయిన్) పైపులైన్ ఏర్పాటు చేయగా, 1.36 లక్షల ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయి. పాత, కొత్తవి కలుపుకుని ఓవర్ హెడ్ ట్యాంకులు(ఓహెచ్‌ఎస్‌ఆర్) 852 ఉండగా, 20 ఓహెచ్‌బీఆర్(బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు)లు ఉన్నాయి. కాగా జిల్లాలోని 40 ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లలోని ఒక్కో విద్యార్థికి 40 లీటర్ల నీటిని అందిస్తున్నారు. అలాగే జనగామ చంపక్‌హిల్స్ ఎంసీహెచ్ ఆస్పత్రికి సైతం మిషన్ భగీరథ వాటర్ ఇస్తున్నారు. ఇదిలా ఉండగా జనగామ మున్సిపాలిటీకి చీటకోడూరు రిజర్వాయర్ ఫిల్టర్ బెడ్ ద్వారా వచ్చే తాగునీటితో పాటు మిషన్ భగీరథ ద్వారా నిత్యం 3 లక్షల లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్

వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఇంట్రా(లోకల్ నీటి సరఫరా విభాగం) అధికారులు యాక్షన్ ప్లాన్ తయారు చేసి సర్కారుకు నివేదిక పంపించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సీడీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) రూ.1.80కోట్లు మంజూరు కాగా, ఎమర్జెన్సీ ఫండ్ రూ.1.95 కోట్లకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ వచ్చింది. జిల్లాలో గ్రామీణ పరిధిలో 2003 సింగిల్ ఫేస్ బోరు మోటార్లు, ఓపెన్ వెల్స్, డైరెక్ట్ పైపులైన్లు ఉన్నాయి. ఇందులో 190 పంపుసెట్లు, 112 చేతిపంపులు, లీకేజీలు లేకుండా 6,506 మీటర్ల పైపులైన్ రిపేరు చేశారు.

తాగునీటి ఎద్దడి లేదు



జిల్లాలో తాగునీటి ఎద్దడి లేదు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో జనగామకు డైవర్షన్ చేసుకున్నాం. మల్లన్నసాగర్‌కు అనుసంధానంగా మంగోలు వద్ద 540 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ట్రీమెంట్ ప్లాంట్లు చేపట్టిన తర్వాత సమస్య లేకుండా పోయింది. ప్రస్తుతం 135 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా జిల్లాకు ప్రతి రోజు 58.09 ఎంఎల్‌డీ నీరు వస్తోంది.

- శ్రీనివాస్, ఈఈ, మిషన్‌భగీరథ గ్రిడ్

నిత్యం నీటి సరఫరా..



జిల్లా పరిధి 12 మండలాలు 610 గ్రామాలకు నిత్యం తాగునీటిని సరఫరా చేస్తున్నాం. అత్యవసర సమయంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సింగిల్ ఫేస్ మోటార్లు, చేతి పంపులు, ఓపెన్ వెల్స్, పైపులైన్లను రిపేర్లు చేసి వినియోగంలోకి తెచ్చాం.

- బి.శ్రీకాంత్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ, జనగామ

హరితహారం మొక్కలకు నీరు

- కదలిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్

జనగామ: వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడిన నేపథ్యంలో అధికార యంత్రాంగం జిల్లా నర్సరీలతో పాటు పలు ప్రాంతాల్లో ఎండిపోతున్న మొక్కలకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. నీరు లేక హరితహారం మొక్కలు ఎండిపోతున్న తీరుపై ‘ఎండుటాకులు’ శీర్షికన బుధవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి మండలాల్లో అధికారులు స్పందించారు. రఘునాథపల్లి ఎంపీడీఓ జి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు గిద్దబండతండా ప్రకృతివనంలో ఎండుతున్న మొక్కలకు పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది నీళ్లు అందించారు. పాలకుర్తి నర్సరీల్లో ఎండిపోయిన మొక్కలకు సిబ్బంది నీరుపోసి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. దేవరుప్పుల మండల పరిధి నల్లకుంటతండా, పడమటితండా(డీ) నర్సరీల్లో నీటి కొరతపై అనుబంధ శాఖల అధికారులు స్పందించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సూచన మేరకు ఎంపీఓ సురేష్‌కుమార్.. జీపీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. పాలిథిన్ కవర్లలో నాటిన మొక్కలు ఎండిపోకుండా జీపీ ట్యాంకర్‌కు ప్రత్యేక మోటారు ఏర్పాటు చేసి నర్సరీలోని సింథటిక్ డ్రమ్ముల్లో నీటిని నింపి సరఫరా చేసేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా.. ‘సాక్షి’ కథనంలో పేర్కొన్న అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీశారు.



పాలకుర్తి: ఎండిన మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది



గిద్దబండతండా ప్రకృతి వనంలో..

పోస్టల్ బ్యాలెట్ వివరాలివ్వాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు శాఖల వారీగా వివరాలు ఇవ్వాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పేరు, హోదా, ఓటరు గుర్తింపు కార్డు, సెల్ నంబర్ తదితర పూర్తి వివరాలతో వారంలోగా నివేదిక ఇవ్వాలని చెప్పారు. అలాగే ఎన్నికల నేపథ్యంలో అక్రిడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులకు ఆథరైజేషన్ లెటర్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామన్నారు.

ర్యాండమైజేషన్ పారదర్శకంగా చేయాలి..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేష్‌కుమార్‌తో కలిసి ర్యాండమైజేషన్ ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో మొదటి దశ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా ఈవీఎంలు, వీవీప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కేటాయించామన్నారు. హార్డ్, సాఫ్ట్ కాపీలు వారికి అందిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో వినియోగించే సామగ్రి ధరల పట్టికలను పార్టీల ప్రతినిధులకు అందజేసిన ఆయన అభ్యంతరాలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. ఆర్డీఓలు వెంకన్న, కొమురయ్య, ఏఓ వీందర్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు, దుర్గారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్

స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి

- అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్

జఫర్‌గఢ్: పిల్లలకు సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. రేగడితండా శివారు టీబీతండా వద్ద ఉన్న ప్రజాధరణ మా ఇల్లు అనాథ ఆశ్రమంతో పాటు రఘునాథ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను వివిధ శాఖల అధికారులతో కలసి ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా రఘునాథ్‌పల్లి పాఠశాలలో సదుపాయాలు, అవసరమైన వసతులను తెలుసుకున్నారు. అనంతరం మా ఇల్లు అనాథ ఆశ్రమానికి చేరుకుని రికార్డులు పరిశీలించడంతో పిల్లలకు భోజన సదుపాయం, మౌలిక వసతుల గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ నిర్వహణ, పిల్లలకు మెరుగైన సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డీఈఓ రాము, బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, ఎంపీడీఓ సుమన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, లళితరాణి, శ్రీకల్ప, నిర్వాహకురాలు గాదె పుష్పరాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ‘అసెంబ్లీ’ కో-ఆర్డినేటర్ల నియామకం

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు 12 మంది



ఎం.భవానీరెడ్డి (జనగామ) | పింగిళి వెంకట్‌రెడ్డి (స్టేషన్‌ఘన్‌పూర్) | పాలడుగు పద్మ (పాలకుర్తి)

సాక్షిప్రతినిధి, వరంగల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించింది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ ఇన్‌చార్జిలను కేటాయించింది. ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు కో–ఆర్డినేటర్ల నియామకపు ఉత్తర్వులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ బుధవారం విడుదల చేశారు. జనగామ నియోజకవర్గానికి ఎం.భవానీరెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్(ఎస్సీ)కు పింగిళి వెంకటరెడ్డి, పాలకుర్తికి పాలడుగు పద్మ, డోర్నకల్(ఎస్టీ)కు గంటా సంజీవ రెడ్డి, మహబూబాబాద్(ఎస్టీ)కి బండి సుధాకర్ గౌడ్‌లను నియమించారు. అదే విధంగా నర్సంపేటకు డాక్టర్ పులి అనిల్‌కుమార్, పరకాలకు బి.అశోక్ రెడ్డి, వరంగల్ పశ్చిమకు ఆరోహి సంగీత, వరంగల్ తూర్పునకు జాలి కమలాకర్ రెడ్డి, వర్ధన్నపేట(ఎస్సీ)కు కుందూరు వెంకట రెడ్డి, భూపాలపల్లికి మార్కం విజయ్‌కుమార్, ములుగు (ఎస్టీ)కు కూచన రవళిరెడ్డి నియోజకవర్గ సమన్వయకర్తలుగా వ్యవహరించనున్నారు.

ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

- వరంగల్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య

ఖిలా వరంగల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు వరంగల్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేటకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి విడత ర్యాండమైజేషన్‌ను సహాయ రిటర్నింగ్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని 106 వరంగల్ తూర్పు, 107 వర్ధన్నపేట, 103 నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు 792 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1,808 బ్యాలెట్ యూనిట్లు, 1,029 కంట్రోల్ యూనిట్స్, 1,172 వీవీ ప్యాట్లు మొదటి విడత ర్యాండమైజేషన్‌లో కేటాయించినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏకరూప ధరల పట్టికను ధ్రువీకరించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్వో శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఎన్నికల కంట్రోల్ రూం తనిఖీ

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూంను కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం పనితీరుపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వ్యయం, ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలు, ఇతర అంశాలను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన ఎంపీసీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్ఎస్‌టీ బృందాలు సమర్థవంతం పనిచేయాలని సూచించారు. అన్ని విభాగాల నోడల్ బృందాలు సమన్వయంతో నివేదికలు సకాలంలో ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కంట్రోల్ రూం అధికారులను కోరారు. అనంతరం ఫిర్యాదులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఆమె స్వయంగా పరిశీలించారు. సీవిజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, పరిష్కార వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సీవిజిల్ యాప్ ద్వారా 2 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 25 కాల్స్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ (ఎన్‌జీఎస్) పోర్టల్ ద్వారా 162 ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి ద్వారా సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- డీడబ్ల్యూఓ జయంతి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వేసవికాలంలో వడ దెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి జయంతి అన్నారు. స్థానిక ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ చర్యలపై అంగన్‌వాడీలు, జీపీ సిబ్బందికి బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సరిపడా నీరు తాగాలని, సూర్య రశ్మి నేరుగా శరీరంపై పడకుండా గొడుగు, టోపి, కళ్లద్దాలు, టవల్ తదితర వస్తువులను వినియోగించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాధ్యమైనంత వరకు ఇంటిలోనే ఉండాలని, ఎండలో పనిచేయడం, ఆటలు ఆడటం చేయవద్దని సూచించారు. ఆల్కహాల్, టీ, కాఫీ, చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని, చెప్పులు లేకుండా ఎండలో నడవవద్దని పేర్కొన్నారు. శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల కంటే ఎక్కువగా ఉండి అధిక చెమట రావడం, దాహం వేయడం, బలహీనంగా అనిపించడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. వీలు కాకుంటే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జనార్దన్, సీడీపీఓ ఫ్లోరెన్స్, హెల్త్ సూపర్‌వైజర్ వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బ నివారణ చర్యల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జయంతి తదితరులు

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

చిల్పూరు: పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి మనోహర్ అన్నారు. నష్కల్‌లో బుధవారం ఆయన టీకాల కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. టీకాలు వేయించడం వల్ల పశువులకు కలిగే ఆరోగ్య లాభాలను రైతులకు వివరించారు. మండల పశువైద్యాధికారి అన్వేష్, అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య, సిబ్బంది ఫయాజ్, రమేష్, భిక్షపతి, సదానందం, రవీందర్‌రెడ్డి, వెంకన్న, నాగరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉండొద్దు

- డీఆర్‌డీఓ మొగిళప్ప

చిల్పూరు: వేసవి ముగిసే వరకు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదని డీఆర్‌డీఓ మొగిళప్ప అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం తాగునీటి సమస్య-నివారణపై ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నీటి సరఫరా ఎలా ఉందనే విషయాన్ని రోజూ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యక్షంగా తెలుసుకోవాలని, ఎక్కడైనా సమస్య తీవ్రంగా ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. రోజు విడిచి రోజు ప్రతీ గ్రామంలో నల్లాల ద్వారా నీరందించాలని, అలా కాని పక్షంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని చెప్పారు. ఎంపీడీఓ బర్మావత్ శంకర్‌నాయక్, ప్రత్యేకాధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రంకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కరుణ్‌కుమార్, ఏఈ రజిత, పీఆర్‌ఏఈ నరేష్, ఉపాధిహామీ ఏపీఓ మోహన్ రావు, ఈసీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్

బచ్చన్నపేట: అన్నదాతలు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మవద్దని.. ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధి ఇటుకాలపల్లి, రామచంద్రాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, సీఈఓ కాశ బాలస్వామి, నరేందర్‌రెడ్డి, ఏఈఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సిద్దెంకిలో..

జనగామ రూరల్: జనగామ మండలం సిద్దెంకి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ కొమురయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, సీఈఓ రాంమ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఏఓ వినోద్‌కుమార్

జనగామ మండల పరిషత్‌లో..

జనగామ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన వడదెబ్బ నివారణపై జీపీ కార్యదర్శులకు, ఆరోగ్య సిబ్బందికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్ అవగాహన కల్పించారు. డాక్టర ప్రవీన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం


గణేష్

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మూడు గుడిసెల తండా శివారు కోబల్ తండాకు చెందిన బోడ గణేష్.. సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 1న సాయంత్రం 4.30 గంటల నుంచి కనిపించడం లేదు. బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

డిపో క్రూ లింక్‌పై సమావేశం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే లోకోపైలెట్ డిపో క్రూ లింక్‌ల విషయంలో బుధవారం సికింద్రాబాద్‌లో సికింద్రాబాద్ రైల్వే అధికారులు, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు సమావేశమై సుదీర్ఘంగా చర్చించినట్లు రైల్వే నాయకులు తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ స్థాయిలో క్రూ డిపోలన్నింటినీ ప్రక్షాళన చేసి లింక్‌ల విషయంలో అంచనాకు వచ్చి నిర్ణయం తీసుకుందామని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. అప్పటి వరకు ఎవరి క్రూ లింక్‌లు వారే యథావిధిగా నడిపించుకునేందుకు అనుమతి ఇచ్చారని రైల్వే నాయకులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డు వివేరా హోటల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం పాపయ్యకుంట తండాకు చెందిన లకావత్ గంగు (60), కేతావత్ మహేష్, భుక్య నర్సింహ బుధవారం కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి సొంతూరుకు పయనమయ్యారు. ఈ క్రమంలో భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డు వివేరా హోటల్ సమీపంలో టైల్స్ లోడ్‌తో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారుతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ నర్సింహతో పాటు కారులో వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ లకావత్ గంగు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్సై నాగరాజు తెలిపారు.

చెరువులో మునిగి యువకుడి మృతి


వీరన్న (ఫైల్)

నెల్లికుదురు : చెరువులో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వావిలాలలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుండెపాక వీరన్న (28)ను ఈనెల 1వ తేదీన వావిలాల చెరువులో చేపలు పట్టడానికి రావాలని మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామానికి చెందిన మేకల సంపత్ ఫోన్ చేయగా వెళ్లాడు. చేపలు పట్టిన అనంతరం చెరువులో దిగిన వారు బయటకు వచ్చారు. అయితే వీరన్న రాలేదు. ఎంతవెతికినా ఎక్కడా కనిపించలేదు. ఈ క్రమంలో బుధవారం చెరువులో వీరన్న మృతదేహం కనిపించింది. దీనిపై మృతుడి తండ్రి భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

> వరంగల్ గిర్మాజీపేటకు చెందిన ఓ వ్యక్తి గోల్డ్ స్మిత్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి గుండెపోటు రాగా సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. చేతిలో డబ్బు లేక తాత్కాలికంగా స్టంట్ వేయించుకున్నాడు. ఎలాగైనా పొదుపు చేసి రెండేళ్లలో సర్జరీ చేసుకోవాలని కష్టపడి ఓ వ్యక్తి వద్ద నెలకు రూ.12,500 చిట్టీవేసి మొత్తం 25నెలలు చెల్లించాడు. మొత్తం రూ.3,12,500 చెల్లించిన బాధితుడు.. ఆపరేషన్ చేసుకుంటానని ప్రాధేయపడినా చిట్టీ నిర్వాహకుడు చేతికి చిల్లిగవ్వ ఇవ్వలేదు.

> నగరానికి చెందిన ఓ వ్యక్తి అధిక వడ్డీ ఆశచూపి అప్పు రూపేణ ప్రజలు నుంచి పెద్ద ఎత్తున నగదు సేకరించారు. సుమారు రూ.రెండున్నర కోట్లు పైగా సేకరించి రాత్రికి రాత్రే పరారయ్యాడు. దీంతో అనేక కుటుంబాలు ఛిద్రమయ్యాయి. ఓ వ్యక్తి తన బిడ్డ పెళ్లి కోసం దాచుకున్న డబ్బు పోవడంతో పెళ్లి నిలిచిందని చెబుతున్నారు.

పొదుపు మంత్రం.. భవిత భద్రం

ఆదా చేస్తేనే బంగారు భవిష్యత్..

- లేదంటే జీవన గమనం ఛిద్రం
- ప్రభుత్వ సంస్థల్లో దాచుకోవడమే సురక్షితం..
- అధిక వడ్డీకి ఆశపడి ప్రైవేట్‌గా నిల్వ చేసుకుంటే ముప్పే



ఖిలా వరంగల్ : పొదుపు .. మానవ జీవన క్రమంలో అత్యంత కీలకం. భవిష్యత్ అవసరాలు.. ఆపత్కాళ పరిస్థితులు.. ఇతర వైపరీత్యాలకు ఎదురొడ్డి నిలబడాలంటే డబ్బు నిల్వ చేసుకోవడం ఒక్కటే మార్గం. లేదంటే ఆర్థిక ఒత్తిళ్లకులోనై భవిష్యత్ ఛిద్ర మయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే ఆనందకర జీవితానికి మన దగ్గర కొంత నిధి ఉండడం చాలా అవసరం. కాగా, పొదుపు చేయడానికి అనేక మార్గాలున్నాయి. ప్రభుత్వ సంస్థల్లో మాత్రమే చేయాలి. అప్పుడే సురక్షితం.. అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు సంస్థల జోలికి వెళ్తే ముప్పు తప్పదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

ప్రభుత్వ సంస్థల్లో పొదుపు క్షేమం

భవిష్యత్ అవసరాల కోసం ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత సొమ్మును పొదుపు చేస్తారు. తద్వారా ఎలాంటి ఆర్థిక సమస్యల బాధ లేకుండా ఆనందకర జీవనం కొనసాగిస్తారు. అయితే కొంత మంది బ్యాంక్‌లు, పోస్టాఫీసుల్లో పొదుపు చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు వ్యక్తిగత అప్పులు ఇవ్వడం, ప్రైవేటు కంపెనీల్లో పొదుపు చేస్తారు. మరికొంత మంది చిట్టీలు వేస్తారు. ఇది ప్రమాదమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఒక్కొక్కసారి ప్రైవేటు వ్యక్తులకు అప్పు ఇచ్చి రాబట్టుకోవడానికి కోర్టులు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అలాగే, ప్రైవేటు సంస్థల్లో అధిక వడ్డీకి ఆశపడి పొదుపు చేస్తే మొదటికే మోసం జరిగే అవకాశలు ఉన్నాయి. వరంగల్ మహానగరంతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఎన్నో ప్రైవేటు కమిట్‌మెంట్ చిట్టీదారులు, పొదుపు సంస్థలు బోర్డులు తిప్పేయడంతో ఎన్నో కుటుంబాలు వీధిన పడిన సంగతి తెలిసిందే. సొమ్మును ప్రభుత్వ సంస్థల్లో దాచుకోవడం వల్ల భరోసా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

రికరింగ్ డిపాజిట్లు

వీటిని ఆర్‌డీలు అనికూడా పిలుస్తారు. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆర్‌డీ అకౌంట్‌లను ఏర్పాటు చేసుకుని పొదుపు చేసుకునే వీలుంది. నెలనెలా కొంత మొత్తం పొదుపు చేసుకుని దానిపై వడ్డీ పొందొచ్చు. నెలకు నిర్దిష్టంగా కొంత సొమ్మును నిర్ణీత కాలం వరకు జమ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్ణీత కాల పరిమితి ముగిసిన తరువాత ఆర్‌డీ సొమ్మును వడ్డీతో సహా బ్యాంక్‌లు ఖాతాదారులకు చెల్లిస్తాయి. కనీసం రూ.100 నుంచి ఆర్‌డీ పొదుపు చేసుకునే వీలుంది. పదేళ్ల వరకు ఆర్‌డీలు చేసుకోవచ్చు. సీనియర్ సిటిజన్స్‌కు కొంత అదనంగా వడ్డీ ఇస్తారు.

ఖాతాదారుల సౌకర్యార్థం..

ఖాతాదారుల సౌకర్యార్థం వివిధ బ్యాంకులు ట్యాక్స్ సేవింగ్ డిపాజిట్లను అందుబాటులో తీసుకొచ్చాయి. ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంక్, పోస్టాఫీసులతోపాటు కొన్ని ప్రైవేటు బ్యాంక్‌లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను సమకూరుస్తున్నాయి.

డిపాజిట్ రకాలు..

ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా రెండు రకాలు ఉన్నాయి. టర్మ్ డిపాజిట్, స్పెషల్ డిపాజిట్. టర్మ్ డిపాజిట్ మీద వడ్డీ ప్రతీ ఆరునెలలకు ఒకసారి జమ అవుతుంది. స్పెషల్ టర్మ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ అదే డిపాజిట్లోని ఖాతాకు జమ అవుతుంది. అందువల్ల ఖాతాదారుడికి వడ్డీ మీద వడ్డీ వస్తుంది.

డిపాజిట్ ఎలా?



కొంత మొత్తం నిర్ణీత కాలానికి పొదుపు చేస్తే అలాంటి డిపాజిట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్లు అంటారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్మును బ్యాంకుల్లో 7 రోజుల నుంచి గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు దాచుకునే వీలుంది. కాలం, జమ చేసిన మొత్తం, బ్యాంక్‌లను బట్టి వడ్డీ శాతం మారుతుంటుంది. సీనియర్ సిటిజన్స్‌కు వడ్డీ కాస్త ఎక్కువ చెల్లిస్తారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లను పిల్లల పేరున కూడా ఐదేళ్లు అంత కంటే ఎక్కువ కాలానికి చేసుకునే వీలుంది.

ప్రభుత్వ సంస్థల్లో పొదుపు చేయాలి

> అవసరానికి డబ్బు కావాలనుకునే వారు వడ్డీ కోసం ఆశపడకుండా ప్రభుత్వ సంస్థల్లో పొదుపు చేసుకోవాలి. ముఖ్యంగా జాతీయ బ్యాంకులు, పోస్టాఫీసుల్లో పొదుపు చేసుకోవడం వల్ల డబ్బుకు భరోసా ఉంటుంది. ఈ డబ్బును ఎలా దాచుకోవాలనే విషయమై వివిధ పద్ధతులు ఉన్నాయి. ఇలా దాచుకుంటున్న సొమ్ముకు కూడా వడ్డీలు ఇస్తున్నాం.
>
> వి. హనుమంత్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, వరంగల్ డివిజన్

కడియం.. అవకాశవాది

- బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్, కేయూ అధ్యక్షుడు ప్రశాంత్


కడియం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు,కార్యకర్తలు

కేయూ క్యాంపస్: అవకాశవాది కడియం శ్రీహరి అని, వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం(బీఆర్‌ఎస్‌వీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్, కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూ మొదటి గేట్ వద్ద బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో అనేక పదవులు అనుభవించి కష్ట కాలంలో పార్టీకి అండగా ఉండాల్సిందిపోయి తన కుమార్తె కోసం కాంగ్రెస్‌పార్టీలో చేరిన కడియం శ్రీహరికి సిగ్గులేదని విమర్శించారు. నైతిక విలువలు చెప్పే కడియంశ్రీహరి.. నీతి, నిజాయితీ ఉంటే వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని ఎలా గెలుచుకుంటారో చూస్తామని, దళితులు, బహుజనులు ఒక్కటయ్యారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలోని తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేష్ వంటివారిని అప్రతిష్టపాలుచేసి పార్టీనుంచి వెళ్లగొట్టిన చరిత్ర హీనుడివన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్, సంగని సూర్యకిరణ్, బాధ్యులు అరూరి రంజిత్, లంకరాజగోపాల్,కలకోట్ల సుమన్,అశోక్ గొల్లపల్లి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


నవీన్(ఫైల్)

కాశిబుగ్గ : అనారోగ్య కారణంతో రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య జాన్‌పీరీల గేట్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడకు చెందిన గోదారి నవీన్(24) నాలుగు నెలలుగా గొంతునొప్పితో బాధపడుతూ వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని వైద్యులు సూచించగా భయాందోళనకు గురైన నవీన్.. మంగళవారం ఇంటికి వెళ్లివస్తానని తల్లి లక్ష్మికి చెప్పి ఎంజీఎం నుంచి బయటకు వచ్చాడు. అనంతరం అదేరోజు రాత్రి జాన్‌పీరీలు గేట్ సమీపంలో పుష్‌పుల్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి సోదరుడికి అప్పగించామని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి నీరు విడుదల


సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ పరిధిలోని గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. గత నెల 12 తేదీ నుంచి బ్యారేజీలోని 59 గేట్లు పూర్తిగా మూసి నీటిని బ్యారేజీలో నిల్వ చేశారు. ప్రస్తుతం బ్యారేజీలో 1.12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి బ్యారేజీలోకి 1200 క్యూసెక్కుల నీరు చేరగా ఒక గేట్ తెరచి 450 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు బ్యారేజీ ఏఈ సాయిరాం బుధవారం తెలిపారు. దేవాదుల వద్ద ఉన్న ఇన్‌టెక్ వెల్ వద్ద పంపింగ్‌ను అధికారులు మూడు రోజుల నుంచి నిలిపి వేశారు. ఇన్‌టెక్ వెల్ వద్ద 74.60 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది.

వదినతో మరిది కాపురం..

- ఇద్దరు పిల్లలు పుట్టాక మరో పెళ్లికి సిద్ధం
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

నల్లబెల్లి: వదిన(అన్న భార్య)ను ఇద్దరు పిల్లల తల్లిని చేసి మరో పెళ్లికి సిద్ధపడ్డాడో ఓ మరిది. విషయం తెలుసుకున్న ఆమె పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని బజ్జుతండా శివారు చిన్నతండాకు చెందిన జాటోత్ రాజుకు చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడేనికి చెందిన మమతను ఇచ్చి 2017లో పెళ్లి చేశారు. పిల్లలు పుట్టకపోవడంతో దంపతులు వైద్యులను సంప్రదించారు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఆమెకు గర్భం రావడం లేదు. చివరికి పరీక్షలు చేసిన వైద్యులు రాజుకు పిల్లలు పుట్టరని తేల్చి చెప్పారు. దీంతో మమత.. భర్తతో కాపురం చేయలేనని చెప్పి పుట్టింటికి వెళ్లింది. కొద్దిరోజుల తరువాత అత్త భద్రమ్మ, మామ నర్సింహ, మరిది శ్రీనులు మమత వద్దకు వెళ్లి పిల్లలు పుట్టేందుకు ఆస్పత్రిలో చూయిస్తామని చెప్పి కాపురానికి తీసుకువచ్చారు. కానీ ఆ దంపతులను ఆస్పతికి తీసుకెళ్లలేదు. ఈ క్రమంలో ఓ రోజు 'నీ భర్త రాజుకు పిల్లలు పుట్టరని వైద్యులు చెప్పారు. ఈ విషయం నీకు తెలుసుకదా. నువ్వు (మరిది)శ్రీనుతో కలిసి కాపురం చేయగలిగితే నీకు పిల్లలు పుడతారు' అని అత్తామామలు ఒత్తిడి చేశారు. ఈ విషయాన్ని ఆసరా చేసుకొని మనం అందరం కలిసి సంతోషంగా ఉందాం. ఆస్తిపాస్తులు మనమే అనుభవిస్తామని నమ్మబలికిన శ్రీను మమతతో కాపురం చేస్తూ వస్తున్నాడు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె జన్మించింది. ఇన్నాళ్లు గుట్టుచప్పుడుగా సాగింది. కొంతకాలంగా అత్తామామ, మరిదిలు తరచూ ఆమెతో గొడవ పడుతూ పుట్టింటికి వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తున్నారు. 20 రోజుల క్రితం ఆమెను కొట్టి పుట్టింటికి వెళ్లగొట్టారు. అనంతరం శ్రీను వేరే అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మమత చిన్నతండాకు వచ్చి నిలదీసింది. శ్రీను.. ఆమెను దూషించి వేరే పెళ్లి చేసుకుంటానని తేల్చిచెప్పాడు. దీంతో పోలీసులను ఆశ్రయించింది. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు క్రీడా పోటీలు కొనసాగాయి. కబడ్డీ, వంద మీటర్ల రన్నింగ్, చెస్, క్యారమ్స్ పోటీలను యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి ప్రారంభించారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ పోటీల నిర్వహణలో యూనివర్సిటీ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ సౌజన్య, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, అధ్యాపకులు రవీందర్, జి.మధుశ్రీ, భాగ్యలక్ష్మి, కవిత, లలితకుమారి, కుమారస్వామి, గుగులోత్ కవిత, ఎస్.జ్యోత్స్న, వి.రజిత, పి.రాజేందర్, భూపాల్, విగ్నేశ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే..


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు రూరల్ : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఇంచెర్ల ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా మంత్రి సీతక్క , మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాంనాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ దుర్మార్గపు పాలన అందించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం పది ఏండ్ల పాలనలో ఉద్యోగావకాశాలు కల్పించకుండా కుల, మతాలపై రాజకీయాలు చేస్తూ పబ్బంగడుపుతోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. రైతుబంధు డబ్బు 92 శాతం మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని, ఫాంహౌస్‌లకు మాత్రం జమకాలేదన్నారు. పార్టీ విధేయుడైన బలరాంనాయక్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, సీనియర్ నాయకులు శ్యాంసుందర్, పీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక సాయిశంకర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, బానోత్ రవిచందర్, అఫ్జల్, వంగ రవి, బాదం ప్రవీణ్‌కుమార్, బండి శ్రీను, సూర్యనారాయణ, చింతనిప్పుల భిక్షపతి, మిల్కూరి ఐలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి


మాట్లాడుతున్న మూర్తి

కాశిబుగ్గ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఏసిరెడ్డినగర్ సీపీఎం కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ 36వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన అంతర్గత ఎజెండా అమలు కోసమే నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చిందన్నారు. ఈ విధానంలో భూత వైద్యం , మత మౌఢ్యం చొప్పించి సైంటిఫిక్ టెంపర్మెంట్ లేకుండా చేసిందన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు తలుపులు తెరవడంతో రానున్న రోజుల్లో పేదల విద్య అందని ద్రాక్షలా మారనుందన్నారు. ఇలాంటి విద్యా విధానాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చుక్క ప్రశాంత్, అనిల్, వినోద్, కల్యాణ్, రాకేష్, అక్షిత, నిక్షిప్త, హంస, భూమిక తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్


టీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

- టీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షపతి

హన్మకొండ: జనాభాలో ఎక్కువ శాతం ఉన్న మాదిగ కులస్తులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ అన్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి మాదిగలకు అవకాశం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగ కులస్తుల జనాభా 90లక్షలుంటే వరంగల్‌లో 9 లక్షల మంది ఉన్నారన్నారు. అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అత్యల్ప జనాభా ఉన్న బైండ్ల సామాజిక వర్గానికి చెందిన కడియం కావ్యను తమ అభ్యర్థిగా ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వేషన్ స్థానాలుంటే మూడింటిలోనూ మాదిగలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపిందని మండిపడ్డారు. మాదిగలను ఓటు అడిగే హక్కు ఆ పార్టీకి లేదన్నారు. మాదిగలను రాజకీయంగా ఎదగకుండా అణచివేస్తున్న కడియం శ్రీహరి.. ప్రాణం ఉన్నత వరకు తాను బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని చెప్పి కాంగ్రెస్‌లో ఎందుకు చేరారో, ఇందులో ఉన్న మర్మమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అవకాశం కల్పించాలని, లేని పక్షంలో తమ ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీరో ప్రమాదాల సర్కిల్‌కు అవార్డు

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: విద్యుత్ ప్రమాదాలు పూర్తిగా నివారించాలని, జీరో ప్రమాదాలు కలిగిన సర్కిల్‌కు అవార్డు అందించనున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి చెప్పారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సంస్థ పరిధిలోని 15 జిల్లాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్, డివిజనల్ ఇంజనీర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 132 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్, అంతరాయాలు తగ్గించినందుకు అభినందించారు. ఈ విధానం ఇలాగే కొనసాగించాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు ఆన్‌లైన్‌లో చెల్లించేలా వినియోగదారుల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. బిల్లింగ్ ప్రక్రియ ప్రతి నెల 14వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు సంవత్సరాలపై బడిన వర్క్ ఆర్డర్స్‌ను ముగించాలన్నారు. అవసరం ఉన్నచోట కెపాసిటర్ బ్యాంకులు అమర్చాలన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లు అశోక్ కుమార్, సదర్‌లాల్, మోహన్ రావు, తిరుపతి రెడ్డి, సీజీఎంలు టి.మధుసూదన్, సి.ప్రభాకర్, రాజు చౌహాన్, కిషన్, అశోక్, రవీంద్రనాథ్, కె.ఎన్. గుట్ట, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి


రుద్రయ్య(ఫైల్)

ఐనవోలు: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ముల్కలగూడెం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గండి రుద్రయ్య గౌడ్(58) మంగళవారం ఉదయం తనకున్న రెండు గేదెలను మేపడానికి అడవికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న క్రమంలో అస్వస్థతకు గురై మృతిచెందాడు. మృతుడికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ వల్ల మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బుధవారం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రూపిరెడ్డి సాయిరెడ్డి, సమ్మెట మహేందర్, నల్లబోతు లింగరాజు, పిడుగు దయాకర్ తదితరులు ఉన్నారు.


మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

ఖిలా వరంగల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి రూ.9,170 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. వరంగల్ చింతల్ బస్తీకి చెందిన గారే శంకర్, నారిశెట్టి సతీష్ ఇంట్లో వేర్వేరుగా అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు ఏసీపీ మధుసూదన్‌కు సమాచారం అందింది. దీంతో బుధవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎండి నిసార్ పాషా ఆధ్వర్యంలో బెల్ట్‌షాపుపై అకస్మికంగా దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు.